www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 2 అక్టోబర్ 2024

5

చిత్తూరు

రేపటి నుంచి దసరా సెలవులు

ప్రజాశక్తి - తిరుపతి: విద్యార్థులకు రేపటి నుంచి దసరా సెలవులు ఇస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. అకడమిక్ క్యాలెండర్ షెడ్యూల్‌లో పేర్కొన్న తేదీ కంటే ముందే దసరా సెలవులను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ఈనెల 3వ తేదీ నుంచే దసరా సెలవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. 13వ తేదీతో సెలవులు ముగియనున్నాయి. 14వ తేదీన తిరిగి విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. ఏపీలో రేపటి నుంచి దసరా సెలవులు ప్రారంభమవుతాయని, ఈ నెల 13 వరకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 14న పాఠశాలల పునః ప్రారంభం ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

రక్తదానంపై అపోహలు వద్దు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రక్తదానంపై ఎలాంటి అపోహలను నమ్మకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రెడ్ క్రాస్ కార్యదర్శి సహదేవ నాయుడు కోరారు. జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని రెడ్ క్రాస్ రక్తదాన కేంద్రంలో మంగళవారం ఐరాలకు చెందిన దంపతులు ధన శేఖర్, లయ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. వీరిని అభినందిస్తూ రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయకుమార్, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు అరుణ, ఏవో గోపి అభినందించారు.

మాంసం దుకాణాలు తెరవొద్దు: కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మహాత్మా గాంధీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2వ తేదీన (బుధవారం) నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా మాంసం దుకాణాలు తెరవరాదని, విక్రయాలు జరపరాదని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు మీరి నడుచుకునే వారి దుకాణాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, సీజ్ చేస్తామని హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని మాంసం విక్రయదారులు, హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

విద్యార్థి గిరీష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-సదుం: సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థి జి.గిరీష్ కుమార్ ట్రిపుల్ ఐటి ఇడుపులపాయ కళాశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం గిరీష్‌ని పాఠశాలలో పూర్వ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

చిత్తూరు ఆర్‌డీవోగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు రెవిన్యూ డివిజనల్ అధికారిగా ఎం. శ్రీనివాసులు మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా తెలుగు గంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై చిత్తూరు ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

బోయకొండ హుండీ ఆదాయం రూ.51లక్షలు

ప్రజాశక్తి-సోమల: చౌడేపల్లి బోయకొండ గంగమ్మ ఆలయంలో మంగళవారం అధికారులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ఈవో ఏకాంబరం వివరాలను వెల్లడించారు. గడిచిన 57రోజులకు గాను నగదు రూపంలో రూ.51.58లక్షలు, బంగారు 61గ్రాములు, వెండి 450గ్రాములు, ఉజ్జబికిస్థాన్ వెయ్యి సియంలు మూడు నోట్లు, ఐదు వందలు సియంలు రెండు నోట్లు, సింగపూర్ పది డాలర్లు ఒకటి, రణబేరి గంగమ్మ ఆలయ ఆదాయం రూ.30,500 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శశికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- కుప్పం ఆర్‌డీవో శ్రీనివాస రాజు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో

ప్రజాశక్తి-రామకుప్పం: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని కుప్పం రెవిన్యూ డివిజన్ అధికారి శ్రీనివాస రాజు పేర్కొన్నారు. రామకుప్పం మండల పరిధిలోని బగలనత్తం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో నారాయణ, సర్వేయర్ సురేష్, హెచ్‌ఎం నాగరాజు, దేవకుమార్, రాధభాయ్, కౌసర్, జానకి, మొహనకుమారి ఉన్నారు.

మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మంగళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాల సంచిక "మంగళ విద్యా వాణి" 29వ సంచికను ఆవిష్కరించారు. ఈ సంచికకు కె.గీతాంజలి జ్ఞాపకార్థం ఆమె భర్త సుధాకర పిళ్ళై తిరుపతి, విశ్రాంత ఉపాధ్యాయులు ఋషేంద్ర పతి రెడ్డి సంయుక్త దాతలుగా వ్యవహరించారు. పాఠశాల హెచ్‌ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించగా దాత ఋషేంద్రపతి రెడ్డి ఈ సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, సంజీవి, అరుణ శివప్రసాద్, పిళ్ళారప్ప, సంపంగి, ప్రేమ కృష్ణ, ధన శేఖర్, మోహన్‌లు పాల్గొన్నారు.

సంచికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సామరస్యంగా మెలగాలి

- మత ఘర్షణలకు ప్రేరేపిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ సుమిత్ కుమార్
- ఘర్షణలో నష్టపోయిన భాదితులకు దాత సహకారంతో విరాళం అందజేత



విరాళపు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్మన్

ప్రజాశక్తి-వి కోట: మత ఘర్షణలు, విద్వేషాలు లేకుండా సామరస్యంగా మెలగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. వి కోటలో గత నెల 2వ తేదీన చోటుచేసుకున్న ఘర్షణల్లో నష్టపోయిన బాధితులకు మంగళవారం నష్ట పరిహారాన్ని అందజేశారు. 54మంది కాయగూరలు, పండ్ల వ్యాపారస్తులకు రూ.5.32లక్షల చెక్కును కలెక్టర్‌తో పాటు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, దాత వి కోట యాక్ట్స్ సంస్థ అధినేత దశరథరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ సామరస్యంగా మెలగాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల్లో అవగాహన కల్పించి ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. సేవా భావంతో ఘర్షణలో నష్టపోయిన బాధితులకు పరిహారం అందించేందుకు ముందుకు వచ్చిన దాత దశరథరెడ్డిని కలెక్టర్ అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉండాలని సూచించారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ వి కోటలో జరిగిన దురదృష్టకర సంఘటనను మరచి మత సామరస్యంతో వినాయక చవితి, ఈద్ మిలాదు నబి పండగలు చేసుకున్నామని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో సోదర భావంతో కలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పార్వతి, ఎంపీడీవో మహ్మద్ రఫి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, రాంబాబు, వి కోట ఉప సర్పంచ్ అక్మల్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలో భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తహశీల్దార్‌తో సిపిఎం బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ మండలంలో కొత్తపల్లి గ్రామకంఠంలో అనర్హులకు కేటాయించిన ఇండ్ల స్థలాలపై సమగ్ర సర్వే చేపట్టాలని, తగ్గువారిపల్లి పంచాయతీ జగనన్న కాలనీలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులు ఎవరైనా ప్రశ్నిస్తే వారిని చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మొగిలి గ్రామంలో యానాదులు అనుభవంలో ఉన్న ఊరగుట్టను అగ్రవర్ణ కులాలకు పట్టాలు మంజూరు చేశారని ఇదివరకే జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని, కలెక్టర్ ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో డిప్యూటీ కలెక్టర్ ఊరగుట్ట పూర్వ 59ఎకరాలను సర్వే చేయకపోవడంతో యానాదులకు అన్యాయం చేస్తున్నారని దీనిని సిపిఎం పార్టీ ఖండిస్తూ యానాదులకు తగిన న్యాయం చేయాలని విన్నవించినట్లు తెలిపారు. పేదలకు న్యాయం జరిగేంత వరకు సిపిఎం పోరాటం చేస్తుందని తెలిపారు. వీటిపై తహశీల్దార్ స్పందిస్తూ ఊరగుట్ట 58 ఎకరాల సర్వే పూర్తయిందని రిపోర్టు జిల్లాకు పంపుతామని తెలిపారు. అదేవిధంగా ఎస్టీలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా మండలంలో ఉన్న ఎస్టీలు నివసిస్తున్న అన్ని ప్రాంతాల్లో సర్వే చేసి వారికి కూడా న్యాయం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాంజివరం సురేంద్రన్, మురళి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకరన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ కుమార్, బాధితులు శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం షాపుల బంద్

ఉద్యోగుల నిరసన

పలమనేరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయపురం: మద్యం షాపుల్లో ఐదేళ్లపాటు పనిచేసిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ జీతాలు ఇవ్వకపోగా.. కనీసం ఉద్యోగ బాధ్యత లేకుండా గుట్టుచప్పుడు కాకుండా తమను ప్రభుత్వం ఇంటికి పంపే మార్గం చూపడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 12 నుంచి రాష్ట్రంలో ప్రైవేట్ మద్యం షాపులను ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత ఐదేళ్ళుగా మద్యం షాప్‌లో పనిచేసిన ఉద్యోగులు ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం సమ్మెకు దిగారు. ప్రభుత్వ తమకు వైన్ షాపులో పనిచేసే అవకాశం కల్పించాలని వారు కోరారు.

పలమనేరు: పలమనేరులో ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం మూతపడ్డాయి. మద్యం దుకాణాలలో విధులు చేపట్టే ఉద్యోగులు దుకాణాల ఎదుట ధర్నా చేపట్టి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమంతా గత ఐదు సంవత్సరాలుగా గత ప్రభుత్వం ఆదేశాల మేరకు మద్యం దుకాణంలో విధులను చేపట్టామన్నారు. సేల్స్ మెన్‌గా, సూపర్వైజర్లుగా విధులు చేపడుతూ ప్రభుత్వానికి మంచి ఆదాయాన్ని సమకూర్చామన్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఇందులో యుగంధర్, షఫీర్, జ్యోతి కుమార్, సునీల్, అశోక్, ఫయాజ్, హనుమంతు, ధనుజ్, మంజునాథ్, అనిల్, సురేష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- రేణిగుంట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయతీ రాజ్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళ వారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న వీరికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి అలిపిరి శ్రీవారి పాదాల మెట్ల మార్గం చేరుకున్నారు. రాత్రి 8 గంటలకు తిరుమల చేరుకుని రాత్రికి బస చేస్తారు. 2వ తేదీ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం 11.05 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేస్తారు. బుధవారం రాత్రి తిరుమలలో బస చేస్తారు. 3వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు తిరుమల నుండి బయలుదేరి తిరుపతిలో జరగనున్న వారాహి సభలో పాల్గొని రాత్రి 8.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విజయవాడ తిరుగుప్రయాణం కానున్నారు.

'చెకుముకి'తో శాస్త్రీయ దృక్పథం పెంపు

ప్రజాశక్తి-పుంగనూరు: చెకుముకి పరీక్షల నిర్వహణతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరుగుతుందని జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శి సుశీల అన్నారు. మంగళవారం జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. మండల స్థాయి టెస్ట్‌కు తొమ్మిది పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయికి వీరిలో కొత్త ఇండ్లు మున్సిపల్ హైస్కూల్, ప్రైవేటు స్కూల్ నుంచి కృష్ణారెడ్డి చైతన్య స్కూల్ ఎంపికైనట్లు చెప్పారు. మండల స్థాయిలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం అందజేశారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు మండల, నగర స్థాయి చెకుముకి సంబరాలను బృందావనం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి 36బృందాలుగా మొత్తం 108మంది విద్యార్థులు పాల్గొన్నారు. నగర ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాశాఖ సీఎంవో జయప్రకాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రి ఆలోచనలను పెంచుకొని ప్రశ్నించే తత్వం అలవర్చుకోవడానికి చెకుముకి సంబరాలు దోహదపడుతుందని చెప్పారు. జెవివి సీనియర్ సభ్యులు కే.మునిరత్నం మాట్లాడుతూ సమాజంలో ఇప్పటికీ మూఢనమ్మకాలు కొన సాగడం దురదృష్టకరమని విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం ద్వారా దీన్ని నిర్మూలించవచ్చు అని తెలిపారు.

విజయపురం: విజయపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పాఠశాల హెచ్‌ఎం శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో విజయపురం పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, గంగమాంబపురం పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, జంబాడ పాఠశాల తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. అదేవిధంగా నింద్ర మండలంలో యూటీయఫ్ ఆధ్వర్యంలో జనవిజ్ఞాన వేదిక సైన్స్ సంబరాలు జరిగాయి. విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల స్థాయిలో జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం శివయ్య పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మూఢనమ్మకాలను నమ్మకూడదని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 8 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

రామకుప్పం: మండల స్థాయిలో చేపట్టిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఇంద్ర ప్రకాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని ఆనిగానూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా చైత్ర, కార్తీక్, రమ్య, జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు రామ్మూర్తి, జయశంకర్, మహేంద్ర నాయుడు, కృష్ణారెడ్డి, శంకర్ చలం ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పుంగనూరు: ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్ఆర్ పురం: మండల స్థాయిలో చెకుముకి పరీక్షలలో విజయం సాధించిన వారికి ఎంఈఓలు అరుణాచల్ రెడ్డి, సబర్మతి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలో ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానంలో గెలుపొందిన 28మంది విద్యార్థులకు మండల కేంద్రంలో చెకుముకి పరీక్షలు నిర్వహించారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలికోన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంటెడ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వీడని మిస్సింగ్ మిస్టరీ

- పోలీసులకు సవాల్‌గా మారిన అస్ఫియా అదృశ్యం కేసు
- పుంగనూరు అర్బన్ కార్యాలయానికి వచ్చిన డీఐజీ మునిషి భాజ్
- వివిధ కోణాల్లో దర్యాప్తు ముమ్మరం
- తీవ్ర ఉత్కంఠకు దారి తీసిన చిన్నారి మిస్సింగ్ వ్యవహారం

పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో చర్చిస్తున్న డీఐజీ

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు పట్టణం ఉబేదుల్లా కాంపౌండ్‌లో అజ్మతుల్లా కుమార్తె అస్ఫియ అదృశ్యమైన కేసు దర్యాప్తు పోలీసులకు సవాలుగా మారింది. చిన్నారి అదృశ్యం కేసు విషయమై అనంతపురం రేంజ్ డిఐజి -షి మునిషి భాజ్ పెయి మంగళవారం పుంగనూరు అర్బన్ కార్యాలయానికి విచ్చేశారు. కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన 11 బృందాలను విడివిడిగా పిలిచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మణికంఠ చందోల్ రెండు రోజులుగా మాఖాం వేసిన ఎలాంటి క్లూ దొరకడం లేదు. పోలీసులకు ఈ కేసు ఓ సవాల్‌గా మారడమే కాకుండా కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. ఈ సంఘటన పట్టణంలో ప్రజలు తీవ్ర ఉత్కంఠతతో ఏ సమయానికి ఏమి వినాల్సి వస్తుందో అని ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ఎక్కడ చూసినా ఎక్కడికి వెళ్లినా చిన్నారి అదృశ్యంపైనే మాట్లాడుకోవడం జరుగుతున్నది. పోలీసు దర్యాప్తు ఎంత వేగవంతం చేయాలన్నా ఎలాంటి చిన్న ఆధారం కూడా లేకుండా ఉన్నదని వారి తల పట్టుకోవడం జరుగుతుంది. ఇప్పటికే బాలిక అదృశ్యమైన పరిసర ప్రాంతాల్లో ఉన్న మహిళలను, పురుషులతో పాటు, వారి బంధువులందరికీ పిలిసి విచారించడం జరుగుతోంది. దీనిపై డిఐజి రాకతో మీడియా మిత్రులు సుమారు మూడు గంటల పాటు వేచి చూసిన ఆమె కనీసం పలుకరింపు కూడా లేకుండా వెళ్లిపోవడం జరిగింది. కేసు విషయంపై ఎస్పీని మీడియా కోరగా కేసు దర్యాప్తులో ఉన్నది ప్రస్తుతం దానిపై ఎలాంటి విషయాలు చెప్పలేమని, సహకరించాలని కోరారు.

సీనియర్ సిటిజన్‌లకు న్యాయ విజ్ఞాన సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న జడ్జి లిఖిత

ప్రజాశక్తి-పలమనేరు: జూనియర్ సివిల్ కోర్టులో జడ్జ్ లిఖిత ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి లిఖిత మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీనియర్ సిటిజన్‌లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తల్లితండ్రులను వారి కుమారులు చూడకుండా ఇంటి నుంచి వెలివేసినా, వృద్ధాశ్రమంలో బలవంతంగా చేర్పించినా అలాంటి వాటిపై కోర్టులో నేరుగా వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వెంటనే తగు చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. పెన్షన్లు సక్రమంగా అందకపోయినా అలాంటి వాటిపై కూడా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. దీంతో సంబంధిత రెవెన్యూ శాఖకు, మున్సిపాలిటీ అధికారులకు, ఎంపీడీవో కార్యాలయ అధికారులకు తెలిపి అలాంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

నూతన మద్యం పాలసీ విధానం ఖరారు

- ప్రైవేటు వ్యక్తుల ద్వారా మద్యం షాపుల నిర్వహణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ నూతన ఎక్సైజ్ పాలసీ విధానం మేరకు జిల్లాలోని 14మద్యం దుకాణాలను టెండర్ ద్వారా రెండు సంవత్సరాలు ప్రైవేటు వ్యక్తుల ద్వారా నడపనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 14, మున్సిపాలిటీ నగిరి 6, పుంగనూరు 6, కుప్పం 5, పలమనేరు 6 మద్యం దుకాణాలతో పాటు మండల పరిధిలోని 67 మద్యం షాపులకు ఆన్లైన్ ద్వారా అక్టోబర్ 1వ తేదీ మంగళవారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మద్యం షాపుల కోసం రూ.2 లక్షలు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. చిత్తూరు జిల్లాలో రూ.55లక్షలు వ్యాపారం జరిగే షాపులు 34, రూ.65లక్షలు వ్యా పారం జరిగే షాపులు 70 వరకు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని బార్ల లైసెన్సులు యథావిధిగా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తులను ఈనెల 11వ తేదీ జిల్లా కేంద్రమైన చిత్తూరులోని సహకార షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపంలో లాటరీ ద్వారా కేటాయించనున్నట్లు తెలిపారు.

ఓటరు పరిశీలన పక్కాగా ఉండాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వివేక్ యాదవ్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా తయారీకి అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పక్కాగా ఉండాలని ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు వి కోట నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా సచివాలయం నుంచి డిఆర్‌వో బి.పుల్లయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. సిఈఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి నిర్దేశించిన గడువులోగా కార్యక్రమాలన్నిటిని పూర్తి చేయాలని కలెక్టర్‌లకు సూచించారు. ఫారం 6, 7, 8 ద్వారా అందిన క్లెయిమ్‌లను పరిష్కరించాలన్నారు. ఏఈఆర్‌వోల నియామకం చేపట్టాలని తెలిపారు. జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించి ఇంటింటి సర్వే పూర్తి చేయడమైనదని, ఫారం-6కు సంబంధించి 3,766, ఫారం-7కు సంబంధించి 9913, ఫారం-8కు సంబంధించి 16,642 క్లైమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని త్వరలో పరిష్కరిస్తామని, డెత్ క్లెయిములు కూడా పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ ఎన్నికల అధికారికి వివరించారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి

- కలెక్టర్‌ల వీడియో కన్ఫరెన్స్‌లో మంత్రి సత్యప్రసాద్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రెవెన్యూ సమస్యల పరిష్కా రానికి శాశ్వత పరిష్కారం చూపాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఫ్రీ హోల్డ్ చేసిన భూముల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కారం, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ పరిస్థితిపై సమీక్షించి కలెక్టర్‌లకు దిశానిర్దేశం చేశారు. చిత్తూరు నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లాలో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, భూ సమస్యలు అధిక శాతం కుటుంబ సభ్యుల మధ్య ఉన్నవే ఉన్నాయని, రీ సర్వే, డీకేటీ పట్టాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం వంటి కారణాల వలన అధిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లు గుర్తించామని కలెక్టర్ మంత్రికి వివరించారు.

వాగ్గేయకార శిరోమణి శ్రీసారంగపాణి



సంగీత, సాహిత్యాన్ని ఆలపిస్తున్న సంగీత పండుతులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: వాగ్గేయకార శిరోమణి.. శ్రీవేణుగోపాలస్వామిని ఆరాధించిన పరమ భక్తుడు శ్రీ సారంగపాణి అని పదరచన, సంగీత సాహితీ చంద్ర అవార్డు గ్రహీత శ్రీ సాయికృష్ణయాచేంద్ర అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ఆడిటోరియంలో సంగీత సాహిత్యగేయదార శ్రీభూమన్‌తో పాటు పలువురు ప్రముఖ రచయితలతో నిర్వహించిన శ్రీసారంగపాణి పదపరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎందరో వాగ్గేయకారులకు శ్రీసారంగపాణి ఆదర్శనీయమని కొనియాడారు. అదే విధంగా సంగీత సాహితీ రత్న బిరుదాంకితులు వెంకటేశ్వర భక్తి చానల్ తిరుపతి పూర్వ అధ్యక్షుడు వెలుగోటి వంశోద్ధారకుడు శ్రీ డాక్టర్ భాస్కర్ సాయికృష్ణ యాచేంద్ర, సంగీత సాహిత్య గేయ ధారను నడిపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నై ఐకాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్టువేర్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్. సంగీత సాహిత్య తెలుగు భాషాభిమాని శోభరాజు నిర్వహించగా, శతావధాన చక్రవర్తి రచయిత, వక్త అధ్యాత్మిక వేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు కోఆర్డినేటర్, సారంగపాణి ప్రాజెక్టు డాక్టర్ ఆముదాల మురళీ సంచాలకులుగా వ్యవహరించారు. సారంగపాణి ప్రాజెక్టు టీటీడీ శ్రీభూమన్ సారంగపాణి పదపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు.

సిఐను కలిసిన టిడిపి నాయకులు

సిఐను సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు, ఎస్ఆర్ పురం: జీడీ నెల్లూరు సిఐగా నూతన బాధ్యతలు చేపట్టిన లక్ష్మీ నారాయణను పలువురు టిడిపి నాయకులు మంగళవారం మర్యాదపుర్వకంగా కలిశారు. దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఎస్ఆర్ పురం మండలంకి చెందిన పలువురు సిఐని కలిశారు. నాయకులు కృష్ణమ నాయుడు, స్వామి దాస్, శ్రీధర్ యాదవ్, వెంక టేష్, నర్సింహులు నాయుడు, దేవసుందరం, జ్యోతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి మోహన్‌కుమార్ తెలిపారు. మంగళవారం ప్లాంట్‌కు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. వారపు సంత వద్ద ఏర్పాటు చేసేందుకు సిద్ధమైనట్లు చెప్పారు.

విద్యుత్ ఏఈగా తనిగవేలు

ఏఈ తనిగవేలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ విద్యుత్ శాఖ ఏఈగా తనిగవేలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బంగారుపాళ్యం మండలం ఏఈగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జ్ ఏఈగా ఉన్న రాజా చిత్తూరుకు బదిలీపై వెళ్లారు.

నగరి ఎక్సైజ్ సీఐగా శ్రీనివాస రెడ్డి

శ్రీనివాస రెడ్డి

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగిరి ఎక్సైజ్ సీఐగా శ్రీనివాస రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అతను సత్యసాయి జిల్లా పెనుకొండ నుంచి బదిలీపై నగిరికి వచ్చారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా, బెల్టు షాపులు నిర్వహిస్తే ఉపేక్షించలేదని, ఎక్కడైనా నాటు సారా తయారు చేస్తుంటే తమకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వ్యక్తి యొక్క వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అలాగే ప్రజలు కూడా నాటు సారా తయారీకి దూరంగా ఉండాలని హెచ్చరించారు.

వెలుగు సీసీలు..

వాహీద్

మునిరత్నం

ప్రజాశక్తి-సోమల: మండల సమైక్య కార్యాలయం లో ఇద్దరు నూతన సీసీలు విధులలో చేరారు. వాహీద్ సిసి కందూరు క్లస్టర్‌కు, మునిరత్నం సిసి లంజంపేట క్లస్టర్‌కు బాధ్యతలు చేపట్టారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం గౌహర్ సుల్తానా ఆధ్వర్యంలో వైద్యాధి కారులు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పోషకాహారము, మంచి అలవాట్లు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో రాజేశ్వరి, మబీన, భారతి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

లింగారెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలానికి చెందిన ఆరిమాని గంగమ్మ ఆలయ చైర్మన్ లింగారెడ్డి, సుధాకర్ నాయుడు మంగళవారం టీడీపీలో చేరారు. మండల పర్యటనకు విచ్చేసన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వారికి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం నియోజకవర్గంలో వివిధ మండలాల్లో ప్రభుత్వ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు.

వాటర్ క్యాన్లు వితరణ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు అర్బన్ ఐసీడీ ఎస్ సెక్టార్‌లో 20అంగన్వాడీ కేంద్రాలకు సామా జిక సేవాదాత శ్రీపురం సీతారామయ్య, నాగమణి చారిటబుల్ ట్రస్ట్, రత్న బయో లైఫ్ సంయుక్తం గా సామగ్రిని అందజేశారు. ప్రెజర్ కుక్కర్‌లు, వాటర్ క్యాన్లు, మ్యాట్లు వితరణ ఇచ్చారు.

వయోవృద్ధులను సంరక్షించాలి

ప్రజాశక్తి-సదుం: వయోవృద్ధులను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని సదుం సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పకుమారి అన్నారు. మంగళవారం సిహెచ్‌సిలో "అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులు, వారి సహాయకులతో వృద్ధుల సంరక్షణ పైన, సహాయ వ్యవస్థల పైన వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌సి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ భార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పంచాయతీలో ఉపాధి గ్రామ సభలు

ప్రజాశక్తి-సోమల: పలు అభివృద్ధి పనులకు సంబంధించి అంచాలు తయారు చేసేందుకు బుధవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఏపీవో దినకర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి నూతన పనులను గుర్తించడం జరుగుతుందన్నారు.

ఏచూరి బాటలో నడుద్దాం.. :ఎమ్మెల్యే

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బాటలో నడుద్దాం.. దేశాభివృద్ధికి కృషి చేద్దామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఏచూరి సంస్మరణ సభ సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు హాజరై సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏచూరి దేశాభివృద్ధికి కీలకపాత్ర పోషించారని, ప్రజలు, శ్రామికుల సమస్యలపై పోరాడుతూ కష్టజీవులకు అండగా నిలిచి పలు ఉద్యమాలు చేశారని అన్నారు. వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుంచి అనేక ప్రజాపోరాటాలకు నాంది పలికారని, ఎమర్జెన్సీ కాలంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రశ్నించిన గొప్ప నాయకుడని కొనియాడారు. విశాఖ ఉక్కు పై పార్లమెంట్‌లో అధికార పక్షాన్ని నిలదీశారని, యుపిఎ ప్రభుత్వ ఏర్పాటుకు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అటువంటి వ్యక్తి మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చిన్నబాబు, జెడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి, గంజి మాధవయ్య, ఏలుమలై, అమ్ములు, కరుణ యాదవ్, సిపిఎం నాయకులు పి.భాస్కర్, ఎ.విజయ్, ఎ.శివ, బాష, రమేష్, కెఆర్. సుబ్రహ్మణ్యం పిళ్లై, నరసింహులు, సుబ్రహ్మణ్యం, దేవా, సతీష్ కుమార్, సురేష్, ముఖేష్ కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి..

ప్రజాశక్తి - క్యాంపస్ :

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కళాశాల ప్రిన్సిపల్ ద్వారకనాథ్ రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ లో భాగంగా ఒక చెట్టు తల్లి పేరుతో తిరుపతి ఎన్‌సిసి క్యాడెట్లు మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా క్యాడెట్స్ "స్వచ్ఛత హీ సేవ" అనే మహత్తర కార్యక్రమాన్ని ఎస్‌వి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం, ఎన్సీసీ క్యాడెట్స్ తమ తల్లితో కలిసి, తాము చదువుతున్న కళాశాలలో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని విస్తరించడమే కాకుండా, తల్లుల పట్ల తమ కృతజ్ఞతను వ్యక్తపరుస్తున్నారు. ప్రతి మొక్క తల్లి ప్రేమకు ప్రతీకగా పెంచి, సంరక్షణ చేయాలని క్యాడెట్స్ కృతనిశ్చయంతో ముందుకెళు తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ రక్షణపై అవగాహన పెరిగి, సామాజిక బాధ్యతను అందరూ అనుసరించాల్సిన అవసరం ఉందని సందేశం ఇచ్చారు. ఎన్సీసీ క్యాడెట్స్ చేపట్టిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణలో వారి బాధ్యతను నిలిపే ఉదాహరణగా నిలిచింది. మొక్కలను నాటడమే కాకుండా

వాటిని సంరక్షించడం కూడా సర్వసాధారణ కర్తవ్యం అని వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ వి ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి శ్రీ వెంకటేశ్వర రాంనారాయణ్ రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వరకు ఎన్ సిసి క్యాడెట్లచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఉదయ్ కుమార్, ఎన్సీసీ బృందం, మేజర్ లోగనాథన్, బి గోవిందరావు, జి బాలకృష్ణ, బావాజీ, శ్రీధర్, అజయ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు బాధ్యతగా సేకరించాలి

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- సత్యవేడు: ప్లాస్టిక్ వ్యర్థాలను బాధ్యతగా సేకరిం చాలని దుకాణ దారులకు విద్యార్థులు హితవు పలికారు. సత్యవేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాలలోని జాతీయ సేవా విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతహి సేవ 2024ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు సత్యవేడు రైతు భరోసా కేంద్రం, ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర ఆవరణ, పోలీస్ స్టేషన్ ఆవరణ, రోడ్డుపై విసిరేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. దీన్ని అనుసరించి దుకాణ దారులకు ప్లాస్టిక్ వ్యర్థాలను డస్ట్ బిన్ లో పోగు చేయాలని వాటిని వీధుల్లో విసిరివేయకూడదని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆనంద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పివో హరిప్రసాద్ మాట్లాడుతూ యువత వ్యర్థాల నిర్వహణ విషయంలో బాధ్యతయుతంగా ఉండాలని పెరిగిపో తున్న భూతాపం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని సమాజ శ్రేయస్సుకు, కాలుష్య నివారణకు పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శామ్యూల్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాలపై వర్క్ షాప్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి బైరాగిపట్టెడలోని కొండా రెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ సైన్సెస్ నూతన మాస్టర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ అఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విద్యార్థులకు పది రోజుల ఉద్యోగ నైపుణ్య నైపుణ్యాల పై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో భాగంగా ' వ్యక్తిత్వ వికాసం, సాఫ్ట్ స్కిల్స్, ఆంగ్ల భాషా భావ వ్యక్తీకరణ, లక్ష్య సాధన, నాయకత్వం' వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె ప్రకాష్ రెడ్డి తెలిపారు. తిరుపతి 'కౌటిల్య ఇన్‌స్టిట్యూషన్' కంపెనీ నిపుణలచే నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఛైర్మన్ వై కొండారెడ్డి, డైరెక్టర్ లు వైఆనంద రెడ్డి, వై విజయ రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ పి నిరంజన్ రెడ్డి, పి మధుర, అధ్యాపకులు, తల్లిదండ్రులు, కౌటిల్య సీనియర్ మేనేజర్ ఎన్ఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలో మూడవ స్థానం

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: కర్నూలులో ఈ నెల 29వ తేదీ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలో స్థానిక గీతాంజలి స్కూలు విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచారని ఆ స్కూలు కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి తెలిపారు. తమ స్కూలు జట్టు జిల్లా స్థాయిలో తిరుపతి జిల్లా తరపున ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు మూడవ స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ విజయానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయుడు బి కృష్ణమూర్తిని అభినందించారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి-చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు పంచాయతీలో కూతవేటు దూరంలో ఉన్న సర్వే నంబరు 140లో ఐదు ఎకరాల 60 సెంట్లు ఎర్రానిగుంట వుంది. దాని కింద నీటి పారుదల సుమారు 60 ఎకరాలు ప్రభుత్వం మంజూరు చేసిన సిజెఐఎఫ్ఎస్ భూమి వుంది. ఆ భూమిలో వరి సాగు చేసుకుని కొంతమంది నిరుపేదలు జీవనం సాగిస్తున్నారు. ఎర్రానిగుంట కట్ట కింద 146/1లో రెండు ఎకరాల 30 సెంట్లు మందబైలు భూమి వుంది. దానిపై కన్నేసిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతల ముత్తాతల కాలం నుండి మందబయలుగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్ను వేసిన ఆ వ్యక్తి చుట్టు పక్కల భూములను ఆక్రమిస్తున్నాడని గ్రామ ప్రజలు తెలిపారు. రెవెన్యూ అధికారు లు స్పందించి మంద బైలు భూములు ఆక్రమణ ఎక్కడ వున్నా అతనిదే అని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై చర్యలు తీసుకుని రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీకి నెరబైలు విద్యార్థులు

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండలంలోని నెరబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బాలికల విభాగంలో ఎస్‌జిఎఫ్ అండర్ 17 ఫుట్‌బాల్ జిల్లా సెలక్షన్స్‌లో నెరబైలు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు ముక్కు చంద్రశేఖరయ్య, గాజులు ప్రసాద్ తెలిపారు. సెప్టెంబర్ 18న మదనపల్లిలో జరిగిన ఫుట్‌బాల్ సెలక్షన్స్‌లో నెరబైలు పాఠశాలకు చెందిన బాలిక విభాగంలో టీమాధురి , ఎస్‌లలిత, ఏమౌనిక, వైవంశీ కళ్యాణ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనందుకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టి మాధురి జమ్ము కాశ్మీర్ లో జరుగు జాతీయ స్థాయి పోటీకి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పోటీలలో ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపింది.

ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్: అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని అనువాద విభాగం ద్వారా ట్రాన్సలేషన్ టెక్నిక్స్ అండ్ ఛాలెంజస్ అనే అంశంపై జరుగుతున్న రెండురో జుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసిం ది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీవేంకటే శ్వర వేద విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫె సర్ రాణీ సదాశివమూర్తి విచ్చేసి అనువాదం చేయడానికి కావల్సిన టెక్నిక్స్, భాషా పరిజ్ఞానం, కొన్ని రకాల సాహిత్య ప్రక్రియలో ఉన్న అంశా లను ఏ విధంగా ఇతర భాషల్లోకి, ఆ భాషలలో వున్న సౌందర్యాన్ని ఉట్టిపడేలా అనువాదం ఏవిధంగా చేయాలో వివరించారు. జాతీయ సం స్కృత విశ్వవిద్యాలయంలో 24 విభాగాలు ఉన్నా యని, ఆ విభాగాలు అన్నీ కూడా అనువాద విభా గంతో చక్కటి పురోగతి లభిస్తుందని వివరిం చారు. విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ ఫెసర్ ఆర్‌జె రమాశ్రీ, హైదరాబాద్ యూనివ ర్సిటీ తెలుగు విభాగం ఆచార్యురాలు ప్రొఫెసర్ డి విజయలక్ష్మి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత శుక్లా, సాహిత్య విభాగం వరిష్టాచా ర్యులు ప్రొఫెసర్ సత్యనారాయ ణాచార్య, సదస్సు కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎంజి.నందనరావు, డాక్టర్ కనపాల కుమార్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు దసరా వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినివిద్యార్థులు శరన్నవరాత్రుల్లో అమ్మవారి వేషధారణలో అందరిని అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించడానికి ప్రతీకగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడిని వధించిన సందర్భంగా దేశమంతటా దసరా జరుపుకుంటారని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ సురేష్, ఉపాధ్యాయులు చూడామణి, లత, మల్లిక పాల్గొన్నారు.

హామీలపై దృష్టి పెట్టాలి: చింతా మోహన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

వెంకన్న లడ్డూపై రాజకీయం చేయడం మాని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ హితవు పలికారు. ఎన్నికల హామీలు, వెంకన్న లడ్డు అంశాలపై చింతా మోహన్ మంగళవారం శ్రీకాళహస్తిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రూ.700కు లభించే లీటర్ స్వచ్ఛమైన ఆవు నెయ్యిని రూ.320కే టెండర్ ద్వారా టిడిపి కొనుగోలు చేసిందంటేనే అది కల్తీ నెయ్యని ఎవరికైనా అర్థమైపో తుందన్నారు. ఇప్పటికే ఈ అంశంపై చంద్రబాబుకు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిం దనీ, ఇకనైనా లడ్డు రాజకీయం మాని ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారిం చారని సూచించారు. రాష్ట్రంలోని మహిళలను ఉచిత బస్సు ఎప్పుడు ఎక్కిస్తావని ప్రశ్నించారు.

ఎస్‌వియూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య సుధారాణి



ప్రజాశక్తి -క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వ ఒవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఆచార్య కె. సుధారాణి ని నియ మిస్తూ ఉప కులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఉత్తర్వులు అంద జేశారు. ఆచార్య సుధారాణి 1992లో వయోజన విద్యావిభాగంలో లెక్చరర్‌గా చేరి ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొందారు. 32 సంవత్సరాల బోధనానుభవం వున్న వీరిని సీనియారిటీ ప్రాతిపదికన ప్రిన్సిపాల్‌గా విశ్వవిద్యాలయ అధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్వియూ ఆర్ట్స్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు.

అధిక దిగుబడులు సాధించాలి

గుడిపల్లిలో

ప్రజాశక్తి-రామకుప్పం:

రైతులు పండిస్తున్న పంటల్లో అధిక దిగుబడులు సాధించాలని టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది, ఉద్యానవన అధికారులు, రైతులకు కావలసిన పలు సూచనలు, సలహాలు అందజేసి డ్రిప్ ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయంపై అధిక దిగుబడులను సాధించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పనిముట్లు, వివిధ రకాల పథకాలు రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ముని రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, పెరుమాళ్, చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ అధికారి అమృత, రైతుల పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని కంచి బంధార్లపల్లి, పిబి వాడ రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది'

తవణంపల్లి: మండలంలోని పుణ్యాసముద్రం గ్రామంలో అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల గురించి, ప్రభుత్వ పథకాలను వివరించారు,. కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, టిడిపి మహిళా నాయకురాలు చిట్టెమ్మ, రైతు సేవా కేంద్రం సిబ్బంది జ్యోతి, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

మళ్లీ మొక్కలు నాటాలి

- వాటర్ షెడ్ అసిస్టెంట్ పీడీ ఉమాదేవి

కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ పీడీ ఉమాదేవిం

ప్రజాశక్తి-పుంగనూరు: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పొలంలో నాటి ఎండిపో యిన ప్రాంతాల్లో తిరిగి రైతులు వద్ద అదే మొక్కలు నాటించాలని వాటర్ షెడ్ అసిస్టెంట్ పిడి ఉమాదేవి చెప్పారు. పుంగనూరు మండలం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా బహిరంగ సభను గ్రామీణ నీటిపారుదల శాఖ కార్యాలయ ఆవరణం లో మంగళవారం నిర్వహించారు. వారం రోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీల్లో మండలంలో రైతులు పొలంలో నాటిన మామిడి, రోజా మొక్కలు, అల్లనేరేడు, టెంకాయ చెట్లునాటడం జరిగిందని, వీటిలో ఎక్కువ ఎండిపోవడం జరిగిందన్నారు. రోజా చెట్లు వైరస్ సోకడం వల్ల ఎక్కువగా నష్టపోయినట్లు రైతులు సామాజిక తనిఖీ బృందానికి చెప్పారు. మండలంలో సుమారు 2లక్షల15వేలు విలువ చేసే మొక్కలు ఎండిపోవడం జరిగింది సమావేశంలో చెప్పారు. ఎండిపోయిన మొక్కలను తిరిగి రైతులు చేత మళ్లీ నాటించేలా చూడాలని అధికారులు ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. మార్చి 23 నుండి మార్చి 24వరకు 9 కోట్ల 57లక్ష లకు భవనాలు సిసి రోడ్లు కాలువలు ఉపాధి కూలీ లకు చెల్లించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం లో ఏపీడి రవికుమార్, ఎస్‌జెఎం లోకేశ్వర్ రెడ్డి, ఎస్ఆర్పి మల్లికార్జున, ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దసరా, గాంధీ జయంతి వేడుకలు

వివిధ రకాల వేషధారణలో విద్యార్థులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని సుందరరాజపురం విజయం పాఠశాలలో మంగళవారం దసరా, గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అధినేత డాక్టర్ తేజమూర్తి, కార్యనిర్వహణ కార్యదర్శి శైలజ మూర్తి మాట్లాడుతూ అర్ధరాత్రి ఒంటరిగా మహిళలు నిర్భయంగా తిరిగిన నాడే నిజమైన స్వతంత్రమని గాంధీజీ మాటలను గుర్తు చేశారు. నేటి రోజుల్లో స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. కొందరు అనాగరికంగా ప్రవర్తిస్తే ఎదుర్కోవాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య మాట్లాడుతూ గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని సత్ప్రవర్తన క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సకాలంలో నిత్యావసరాలు పంపిణీ చేయాలి'

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు అందిస్తున్న నిత్యవసర సరుకులను ఒకటవ తేదీ సకాలంలో ప్రజలకు అందిస్తున్న తీరును మంగళవారం డిప్యూటీ తాసిల్దార్ లోకనాథ పిల్లై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డు లబ్ధిదారులను నిత్యవసర సరుకుల పై ధరలను తూనికలలో వ్యత్యాసాలపై అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సకాలంలో నిత్యవసర సరుకులు అందించాలని, ధరలు తూనికలలో తేడాలు గుర్తించి లబ్ధిదారులు ఫిర్యాదు అందితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ రెడ్డెప్ప జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

ప్రజాశక్తి-సోమల: చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప జన్మదిన వేడుకలను సోమల మండలం ఆయన స్వగ్రామం వల్లిగట్లలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన జన్మదినం కావడంతో స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులు బంధువులు మిత్రులు, శ్రేయోభిలాషులతో కలసి భారీ కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య జన్మదిన వేడుకలను జరుపు కున్నారు. కార్య క్రమంలో కందూరు సర్పంచ్ బాషా మసూద్, ఆనంద్, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం:

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందినట్లు ఏఎస్ఐ రామచంద్రారెడ్డి తెలిపారు. గత నెల 14న మండలంలోని కొత్తపల్లి ఫ్లైఓవర్ వద్ద పిట్టగోడను కారు ఢీకొన్న ఘటనలో మహిళ తనూజ తీవ్రంగా గాయపడింది. దీంతో 17రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-సోమల:

నాటు సారా స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రామ్ తెలిపారు. మంగళవారం ముందుగా అందిన సమాచారం మేరకు మండలంలోని నంజంపేట పంచాయతీ హరిజనవాడకు చెందిన శ్రీనివాసులు వద్ద ఐదు లీటర్ల నాటు సారా గుర్తించామన్నారు. ఆ మేరకు అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మహారాజశ్రీ ఏజెంట్ టూ గవర్నమెంట్, కొత్తగూడెం వారి కోర్టులో
ఓ.పి. నెం. 26/2021
Between:
తుమ్మురు అరుణ ....పిటిషనర్
మరియు
తుమ్మురు హరి ....ప్రతివాది
టు
1) తుమ్మురు హరి, తండ్రి: మణి (లేటు), వయస్సు: 35సంIIలు వృత్తి: ఉద్యోగి, నివాసం: పెడగంటి గ్రామము, నందనూరు పోస్టు, జి.డి.నెల్లూరు మండలం, చిత్తూరు జిల్లా.
పైన తెల్పిన పిటిషనర్ మీతో జరిగిన వివాహము రద్దు కొరకై పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ఎన్ని పర్యాయములు మీకు నోటీసు పంపిచియున్నాను తీసుకొనకుండ మీరు కాలయపాన చేయటమైనది. అట్టి దావా యందు మీ హాజరు కొరకు గౌరవ కోర్టు వారు **తేది.19-10-2024, ఉIIగంII 10:30నిIIలకు** వాయిదా వేసియున్నారు. కావునా ఆ రోజు మీరు స్వయంగాని లేక మీ తరుపు న్యాయవాది గారి ద్వారా కాని హాజరు కాగలరు.. లేని యేడల మీ పరోక్షంగా కోర్టు వారు తీర్పు యివ్వబడును అని తెలియజేయడమైనది.
వాయిదా: 19-10-2024
//కోర్టు వారి అనుమతితో//
30-09-2024. **రావి విజయ కుమార్**
కొత్తగూడెం. న్యాయవాది, కొత్తగూడెం

IN THE COURT OF ADDL, CIVIL JUDGE (JUNIOR DIVISION)-CUM-JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
I.A.No.194/2024, O.S.No. 202/2024
BETWEEN
A. Eswari ...**Petitioner/Plaintiff**
AND:
K.Subbulu ...**Respondent/Defendant**
NOTICE TO THE RESPONDENT/ DEFENDANT
K.Subbulu, W/o Late K.Balaram, residing at Door No.8-123, Boyalabavi street, Karvetinagaram town and post, Karvetinagaram Mandal, Chittoor Dist.,
Please take summons that, the petitioner/plaintiff filed the suit for recovery of debt basing on the promissory note along with Interlocutory application No.194/2024 in O.S.No.202/2024 in the above Hon'ble court against you and the above petition is posted to 18/10/2024 for your appearance. So, please to be attend on 18/10/2024 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.
K.GOPINATH, B.A., B.L.,
ADVOCATE PUTTUR

IN THE COURT OF ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION)-CUM-JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
O.S.No. 202/2024
BETWEEN:
A.Eswari ...**Plaintiff**
AND:
K.Subbulu ...**Defendant**
SUMMONS TO THE DEFENDANT
K.Subbulu W/o Late K.Balaram, residing at Door No.8-123, Boyalabavi street, Karvetinagaram town and post, Karvetinagaram Mandal, Chittoor Dist.,
Please take summons that, the plaintiff filed the suit for recovery of debt basing on the promissory note in the above Hobile court against you and the above suit is posted to 18/10/2024 for your appearance. So, please to be attend on 18/10/2024 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, falling which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court
K.GOPINATH, B.A., B.L.,
ADVOCATE PUTTUR

IN THE COURT OF ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) -CUM - JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
I.A.No. 193/2024, O.S.No. 200/2024
BETWEEN:
K.Vijayamma ...**Petitioner/Plaintiff**
AND:
K.Subbulu ...**Respondent/Defendant**
NOTICE TO THE RESPONDENT/ DEFENDANT
K.Subbulu, W/o Late K.Balaram, residing at Door No.8-123, Boyalabavi street, Karvetinagaram town and post, Karvetinagaram Mandal, Chittoor Dist.,
Please take summons that, the petitioner/plaintiff filed the suit for recovery of debt basing on the promissory note along with Interlocutory application No.193/2024 in O.S.No.200/2024 in the above Hon'ble court against you and the above petition is posted to 18/10/2024 for your appearance. So, please to be attend on 18/10/2024 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court
K.GOPINATH, B.A., B.L.,
ADVOCATE PUTTUR

IN THE COURT OF ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION)-CUM - JUDICIAL FIRST CLASS MAGISTRATE. PUTTUR
O.S.No. 200/2024
BETWEEN:
K.Vijayamma ...**Plaintiff**
AND:
K.Subbulu ...**Defendant**
SUMMONS TO THE DEFENDANT
K.Subbulu, W/o Late K.Balaram, residing at Door No.8-123, Boyalabavi street, Karvetinagaram town and post, Karvetinagaram Mandal, Chithoor Dist.,
Please take summons that, the plaintiff filed the suit for recovery of debt basing on the promissory note in the above Hon'ble court against you and the above suit is posted to 18/10/2024 for your appearance. So, please to be attend on 18/10/2024 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.
K.GOPINATH, B.A., B.L.,
ADVOCATE PUTTUR